క్లుప్తంగా

శనగ విత్తనాలు మంజూరు

పులివెందుల రూరల్ : మండలానికి సంబంధించి రబీ సీజన్‌లో రైతులు సాగుచేసుకునేందుకు ప్రభుత్వం 1440 క్వింటాళ్లు శనగ విత్తనాలు మంజూరు చేసినట్లు వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నేటి నుంచి రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

లింగాల : స్థానిక దీనబంధు ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పట్టణానికి చెందిన పెరుమాళ్ల రవీంద్ర మనవడు రుషిరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని అందజేశారు. రెండు బస్తాల బియ్యం, చెక్కర, కందిపప్పు, ఆయిల్, చింతపండు, తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు.

చిన్నదండ్లూరులో నాకా బందీ



నాకా బందీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంజీవరెడ్డి

ఎర్రగుంట్ల : చిన్నదండ్లూరులో ఆదివారం తెల్లవారుజామున కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో పలువురి ఇళ్లలో తనిఖీలు నిర్వహించి, గడ్డివాముల్లో సోదాలు చేశారు. అనంతరం ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

శాస్త్రవేత్తకు గుర్తింపు

కాశినాయన: మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామానికి ఆచార్య కడియాల చంద్రబాబునాయుడు మెటీరియల్ సైన్స్ విభాగంలో పరిశోధనలు చేస్తూ వరుసగా నాలుగోసారి అగ్రశ్రేణి శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన అమెరికాలో సాఫ్ట్‌వేర్ విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆయన సమర్పించిన పరిశోధన పత్రాలకు ప్రపంచంలోనే అత్యధిక ప్రజాదరణ లభించడంతో ఈ ఆదరణ దక్కింది. 2020, 2021, 2022, 2023లోనూ అగ్రశ్రేణి శాస్త్రవేత్త జాబితాలో చోటు సంపాదించుకున్న ఆయనను పలువురు అభినందించారు. ప్రస్తుతం ఈయన బెంగుళూరు గీతం విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ అదనపు పని భారం వలన ఆశా కార్యకర్తలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. తాడేపల్లి, పుంగనూరులలో ఆశా కార్యకర్తల మృతి బాధాకరమన్నారు. మృతి చెందిన ఆశా కార్యకర్తలకు నష్టపరిహారంగా 50 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సుభాషిని, జిల్లా ఉపాధ్యక్షులు అమ్ములు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం

బ్రహ్మంగారిమఠం: ఏపీ ఔట్ సోర్స్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని బి.మఠంలోని కృష్ణదేవరాయ బలిజ కాపు తెలగ అన్నదాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ బలిజ సంఘం సభ్యులు ఐక్యంగా బ్రహ్మంగారిమఠంలో అన్నదాన సత్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్‌గా ఉన్న తనకు రాష్ట్ర స్థాయిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా స్థానం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి పిల్ల నారాయణ, బొల్లి సిద్దయ్య, నారాయణ స్వామి, శ్రీరాములు, కొండయ్య, రామయ్య, సుబ్బరాయుడు, అమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

చాపాడు: మండలంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు చాపాడు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి మాచనూరు రాఘవయ్య ఆదివారం అన్నదానం చేశారు.

స్వయం ఉపాధితో కుటుంబానికి భరోసా

టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు



న్యాక్ అకాడమిలో శిక్షణ పొందుతున్న మహిళలు

పులివెందుల రూరల్ : మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పులివెందుల ప్రాంతంలో నిరుద్యోగులు ఉండకూడదనే లక్ష్యంతో 2006వ సంవత్సరంలో నేషనల్ అకాడమిని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా నేషనల్ అకాడమి సంస్థ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తోంది. ఇప్పటివరకు సుమారు 13వేల మందికి టైలరింగులో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొంది తమ కుటుంబాలకు భరోసా కల్పిస్తోంది. టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌తో పాటు బ్లౌజులు, డ్రస్సులు, తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొంది స్వయం ఉపాధితో కుటుంబానికి మహిళలు ఆసరాగా నిలుస్తున్నట్లు తెలిపారు. పులివెందుల ప్రాంతంలో నిరుద్యోగులు ఉండకూడదని రింగురోడ్డు సమీపంలో న్యాక్ అకాడమిని ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించి, వివిధ ప్రాంతాల్లో, రాష్ట్రాల్లో న్యాక్ అకాడమిలో యువకులకు ఎలక్ట్రానిక్స్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్స్, తదితర వాటిపై శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నారు. యువతులకు టైలరింగ్, డ్రస్ మెటీరియల్స్ శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పించడమే ధ్యేయంగా న్యాక్ అకాడమి పనిచేస్తోంది.

మహిళలకు ఉపయోగకరం



మాది మధ్యతరగతి కుటుంబం. ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనుకున్నాను. అందులో భాగంగా రింగురోడ్డు సమీపంలో ఉన్న నేషనల్ అకాడమి నందు టైలరింగ్‌లో నెలరోజుల పాటు శిక్షణ పొందాను. నేను కూడా బాగా నేర్చుకున్నాను. టైలరింగ్ నేర్చుకుని ఇంటి వద్ద బ్లౌజులు, డ్రస్సులు కుట్టుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను.

– పద్మావతి,పులివెందుల.

శిక్షణతో కుటుంబానికి అండగా ఉన్నాను



నేషనల్ అకాడమిలో టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వడం చాలా భాగుంది. మా అమ్మ, నాన్నలకు అండగా నిలవాలనే నేషనల్ అకాడమిలో చేరి టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ శిక్షణ బాగా ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత సొంతంగా కుట్టుమిషన్‌లు పెట్టుకుని కుటుంబానికి ఆసరాగా ఉంటాను.

– రజియా భేగం, పులివెందుల

దివ్యాంగులకు దుస్తులు అందజేత



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఈసీ విశ్వనాథరెడ్డి

పులివెందుల టౌన్ : ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు వితరణ చేపట్టారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ ఈసీ గంగిరెడ్డి సంస్మరణకు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి అన్న కుమారుడు ఉపాధ్యాయులు ఈసీ విశ్వనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ దినేష్‌రెడ్డి సమకూర్చిన దుస్తులను 30 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఏడాది దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వికలాంగుల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, లింగాల మండలం సమైఖ్య అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు



హాస్టల్‌లో విద్యార్థులకు సూచనలు చేస్తున్న పోలీసులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్స్, ప్రైవేట్ హాస్టల్‌లను ఆదివారం ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి, పెండ్లిమర్రి ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డిలు తమ సిబ్బందితో పలు ప్రాంతాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఫంక్షన్ హాల్స్, ప్రైవేటు హాస్టల్స్‌లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా సంబంధిత యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గమనించి తమకు సమాచారం అందించాలన్నారు. హాస్టళ్లు, ఫంక్షన్ హాళ్లలో మద్యం సేవించడానికి, పేకాట ఆడటానికి ప్రయత్నిస్తే ఎప్పటికప్పుడు నిఘా వుంచి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీకే దిన్నె ఏఎస్‌ఐ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న శేషఫణి

వేంపల్లె : వేంపల్లె ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కడపకు చెందిన ప్రముఖ హోమియో వైద్యులు క్రిస్టిపాటి వెంకట శేషఫణి 123 మందికి ఉచితంగా హోమియో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారని అవోపా హోమియో క్యాంపు చైర్మన్ సాయిసత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లె అవోపా అధ్యక్షుడు గోవర్దన్, ఉపాధ్యక్షుడు మద్దాల రాధాకృష్ణయ్య, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ఎర్రగుంట్ల : పోట్లదుర్తిలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఆదివారం కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరు మంది జూదర్లను అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ. 9వేలు నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు : మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకం, తాగునీరు, పారిశుద్ధ్యం, వ్యవసాయం, ప్రజా పంపిణీ వ్యవస్థ, విద్యుత్ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్‌లు హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

దస్తగిరిస్వామి దర్గా కమిటీ ఏర్పాటు

జమ్మలమడుగు : పట్టణంలోని నేతాజీనగర్‌లో ఉన్న దస్తగిరిస్వామి దర్గా నూతన కమిటీని ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి ఎన్నుకున్నారు. 16వ తేదీ నుంచి దస్తగిరి నెల ప్రారంభం అవుతుండటంతో దర్గాకు సంబంధించిన పండుగ నిర్వహణపై చర్చించారు. అనంతరం కమిటీ గౌరవాధ్యక్షడిగా మాబు, అధ్యక్షుడిగా మాహాబూబ్‌బాషా, ఉపాధ్యక్షుడిగా చంటి, కృష్ణ, సెక్రెటరీగా రమణయ్య, జాయింట్ సెక్రెటరీగా గుంటమయ్య, ట్రేజరర్‌గా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీగా అమీర్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా అబ్దుల్ బషీర్, వలి, మారుతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రెండు రోజులపాటు నీటి సరఫరాలో అంతరాయం

జమ్మలమడుగు : పట్టణంలో 12, 13వ తేదీల్లో మైలవరం జలాశయం దొమ్మరనంద్యాల సమీపంలో ఉన్న నీటి సరఫరా చేసే సంప్‌ను శుభ్రం చేస్తుండటంతో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

రేపు తప్పెట్లలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

వల్లూరు : మండలంలోని తప్పెట్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో వైద్య నిపుణులు వైద్య సేవలను అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని ఆమె కోరారు.

నేడు వెలిదండ్లలో

లింగాల : మండలంలోని వెలిదండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రమాదేవి, జడ్పీటీసీ పుష్పాలు హాజరవుతారన్నారు. మండలంలోని ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హాజరుకావాలని ఆయన కోరారు.

11న వల్లూరులో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం

వల్లూరు : మండల కార్యాలయాల సముదాయం ఆరణలో ఈనెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మండల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అభివృద్ధిని ప్రతి ఇంటికీ తెలియజేయాలి

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వం చేస్తున్న అసలైన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో సౌత్ జోన్(క్లస్టర్–3) పరిధిలోని కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. మొదట దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నెల రోజుల పాటు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా సచివాలయ శిబిరాలు నిర్వహించి, ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రదర్శించాలన్నారు. జగనన్న ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చారు, చంద్రబాబు హామీలు ఇచ్చి ఎలా మాట తప్పారనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి సచివాలయంలో ఒక రోజు గడిపి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించాలని, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు. గ్రామ, వార్డు పెద్దలతో డిన్నర్, రాత్రి బస వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ముందుండి నడిపించాలని, కార్పొరేటర్లను భాగస్వామ్యం చేయాలన్నారు. క్లస్టర్–3 ఇన్‌చార్జి తోటక్రిష్ణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనందరం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, మల్లికార్జున, నాగేంద్ర, కె. సూర్యనారాయణరావు, డివిజన్ ఇన్‌చార్జులు ఏ. బాలక్రిష్ణారెడ్డి, ఆర్‌వీ రమణ, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తోటక్రిష్ణకు సన్మానం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సౌత్ జోన్(క్లస్టర్–3) అధ్యక్షుడిగా తోటక్రిష్ణాంజనేయులు ఆదివారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

డేవిడ్‌రాజ్ సేవలు అభినందనీయం

– జాతీయ తపాలా ఉద్యోగుల కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివాజీ



డేవిడ్‌రాజ్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ తపాలా ఉద్యోగుల కార్మిక సంఘ ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన పీఎస్ డేవిడ్‌రాజ్ సేవలు అభినందనీయమని జాతీయ తపాలా ఉద్యోగుల కార్మిక సంఘాల సమాఖ్య(ఎఫ్‌ఎన్‌పీఓ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివాజీ అన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో ఆదివారం జరిగిన డేవిడ్‌రాజ్ అభినందన సభలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ నుంచి తొలిసారి తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వ్యక్తి డేవిడ్ అని కొనియాడారు. పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ప్రయోజనాలకు అనేక పోరాటాలు, ధర్నాలు చేశారన్నారు. డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల సంక్షేమానికి, పాత పెన్షన్ అమలు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డేవిడ్‌రాజ్ దంపతులకు పలువురు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ సుబ్బరాయుడు, ఎన్‌యూ జీడీఎస్ రాష్ట్ర కార్యదర్శి యోగేశ్వరరావు, గురుదాస్, కృష్ణప్రసాద్, సుభాన్, అమర్, చిన బాబు, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

కంటి వైరస్‌పై జాగ్రత్తలు పాటించాలి

కడప రూరల్: కంటికి సంబంధించిన వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని కంటి వైద్యులు ఆసిఫ్ బాష అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎం ఆసుపత్రిలో జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో కంటి వైరస్‌పై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కంటికి సంబంధించిన వైరస్‌లు సోకుతున్నాయని తెలిపారు. కంటి దురద, మంట తదితర లక్షణాలు ఉంటే తక్షణం కంటి వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

రైతులు బిజీబిజీ



శనగ సాగుకు సిద్ధంగా ఉన్న పొలాలు

రాజుపాళెం: రబీ సీజన్ ప్రారంభవడంతో శనగ పంట సాగు చేసే రైతులంతా ఎరువులు వేయడంలో బిజీ అయ్యారు. ఈ ఏడాది పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు చాలా వరకు శనగపై దృష్టి సారించారు. రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసిన రైతులకు ఏఓ శివరామ కృష్ణారెడ్డి విత్తనం రాయితీపై అందిస్తున్నారు. పదునైన వర్షం పడితే శనగ విత్తనసాగు పెరుగుతుందని, ఇప్పటికే 12 వేల ఎకరాల్లో పంట సాగైందని ఏవో తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తా



వినికిడి యంత్రాలను అందిస్తున్న శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: దివ్యాంగుల సంక్షేమానికి సహాయ సహకారాలు అందిస్తానని కొత్తపల్లె సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్ ల్యాంగ్వేజ్ సందర్భంగా స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని మహిళా స్వశక్తి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం కడప డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించిన చెవిటి మిషన్లను బధిరులకు అందించారు. ఈ కార్యక్రమంలో వెల్లాల భాస్కర్, లక్ష్మీకిశోర్, సాయి సందీప్‌కుమార్, ఇర్ఫాన్, సత్యానారాయణ రావు, షాకీర్‌హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మైదుకూరు: మైదుకూరు మత్కన్యకాపరమేశ్వరి ఆలయంలో విజయదశమి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకటప్రసాద్ కోరారు. స్థానిక అమ్మవారిశాలలో ఉత్సవ ఆహ్వాన పత్రికలు ఆయన ఆవిష్కరించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. రోజూ అమ్మవారికి విశేష అలంకారాలు, పూజలు, నవగ్రహ జపాలు, రుద్రాభిషేకాలు, చండీ హోమాలు జరుపుతామని తెలిపారు. గ్రామోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు యలవలి హరికిషన్, దొంతు వెంకటసుబ్బయ్య, దరిశ సునీల్, మిట్టా సురేష్, కోశాధికారి ఎలిశెట్టి గురుప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ గ్రాండ్ టెస్ట్

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నవోదయ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాలకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులకు నవోదయపై అవగాహన కల్పించేందుకు, పోటీతత్వం పెంచేందుకు ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జయరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

బద్వేలు అర్బన్: పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక గాయత్రి జూనియర్ కళాశాల ఆవరణలో రీజనల్ కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన బద్వేలు రీజియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బాల గంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఎస్టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్‌కుమార్, చంద్రశేఖర్, పి.వి.క్రిష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రహాసరెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం



మహాసభలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

పోరుమామిళ్ల: ఉపాధ్యాయుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడం, అలుపెరగని ఉద్యమాలు చేయడం యూటీఎఫ్‌కే సాధ్యమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు నాయబ్‌రసూల్ అధ్యక్షతన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాంతీయ మహాసభలు జరిగాయి. లక్ష్మీరాజ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏళ్లు కావడంతో స్వర్ణోత్సవాలు జరుపుతున్నామని తెలిపారు. ప్రాథమిక విద్యకు పాతర వేస్తే ప్రభుత్వంపై ఉద్యమాలు తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేష్‌బాబు, జయరామయ్య, చెన్నయ్య, అహమ్మద్, ప్రభాకర్, కృష్ణయ్య, ఈశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, భైరవప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం



మైదుకూరులో సెల్ ఫోన్లను తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ మస్తాన్

ప్రొద్దుటూరు క్రైం: క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పలు ప్రాంతాల్లోని లాడ్జీలు, ఇతర ప్రాంతాల్లో ఆదివారం సోదాలు జరిపారు. ప్రొద్దుటూరులో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు క్రికెట్ బెట్టింగ్, మట్కాపై సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, రమణారెడ్డి, సిబ్బంది చర్యలు చేపట్టారు. లాడ్జిలో తనిఖీలు చేసి రిజిష్టర్లు పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. కడప స్పెషల్ పార్టీ, ప్రొద్దుటూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి పలు చోట్ల క్రికెట్ బుకీల ఇళ్లలో సోదాలు చేశారు. కొందరిని అదుపులోకి తీసుకుని ఎస్పీ ఎదుట హాజరు పరిచారు. క్రికెట్ పందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోరుమామిళ్లలో

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో సీఐ చిరంజీవి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. లాడ్జీల్లో బస చేసిన వారి వివరాలు తీసుకున్నారు. లాడ్జి యజమానుల వారి వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేసి పూర్తి ఆధారాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రజమంలో కలసపాడు ఎస్‌ఐ నాగమురళి, కాశినాయన ఎస్‌ఐ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



లాడ్జీలో దిగిన వ్యక్తులతో మాట్లాడుతున్న సీఐ

మైదుకూరులో

మైదుకూరు: మైదుకూరులో లాడ్జిలలో, అనుమానం ఉన్న ప్రదేశాల్లో అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ సోదాలు జరిపారు. అనుమానాస్పద వ్యక్తులు వచ్చినప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బద్వేల్‌లో

బద్వేల్ అర్బన్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని అర్బన్ సీఐ పి.యుగంధర్ హెచ్చరించారు. ఎస్పీ సిద్దార్థకౌశల్ ఆదేశాల మేరకు మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ పర్యవేక్షణలో ఆదివారం పట్టణంలోని లాడ్జీలు, బుకీల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.